

# కందిరీగ కిటుకు

అనగా అనగా ఓ పెద్ద అడవి. ఆ అడవిలో రకరకాల జంతువులు ఉన్నాయి. ఆ అడవికి ఓ సింహం రాజుగా ఉంటున్నది. నిజానికి ఆ సింహం చాలా మంచిది. తనను చూసి మిగిలిన జంతువులు భయపడడం ఆ సింహానికి ఇష్టం లేదు. ప్రతి వారూ తన దగ్గరకు రావాలనీ, వారి వారి బాధలు తనతో చెప్పుకోవాలనీ సింహం అభిప్రాయం. సింహం కూడా మారువేషంతో అప్పుడప్పుడు అడవిలో తిరుగుతూ ఉండేది.

అలా తిరగడంలో ఓ ఏనుగు తటస్థపడింది. ఈ ఏనుగుకూడా తెలివైనదే, కాని దాని గుణం అట్టే మంచిదికాదు. మరొకరు సుఖంగా ఉండటం, హాయిగా నవ్వుకోవడం ఆ ఏనుగుకు గిట్టదు.

అంత క్రితం ఆ ఏనుగు ఇంకో అడవిలో ఉండేది. అక్కడ కూడా ఇలాంటి వెర్రి వేషాలు వేయడం సాగించింది. దాంతో అక్కడి జంతువులు ఈ ఏనుగును తన్ని తరిమేశాయి. అప్పుడు ఇక్కడికి వచ్చింది.

వచ్చినప్పట్నించీ అది సింహంతో పొత్తుకలపాలని చూస్తూనే ఉన్నది. సింహం మారువేషంతో తిరుగుతున్నప్పుడు, ఏనుగు పసిగట్టి సింహంతో కబుర్లాడింది. మాటలు పెంచింది. స్నేహం చేసింది. ఆ స్నేహం బాగా పెంచేసింది కూడా. సింహం మంచిదనుకొన్నాం గదా! అంచేత దానికి ఎదుటి వారి చెడ్డగుణాలు. ఒకంతట తెలిసేవికావు. అందరూ-మంచివారే ననుకొనేది సింహం. అందరి మాటలూ నమ్మేది పాపం.

ఏనుగు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఇతర జంతువుల మీద చాడీలు చెప్పేది. అబద్ధాలాడేది. చివరికి సింహాన్ని తన చేతిలో చిక్కించుకొన్నది. సింహానికి ఏనుగు ఎంత చెబితే అంత! ఈ ఆసరా చూసుకొని ఏనుగు మిగిలిన జంతువులను వేధించుకు తినేది. భయపెట్టేది. బెదరకొట్టేది. జంతువులు చాలా కాలం ఈ బాధను భరించాయి. ఏం చేయడానికి వాటికీ తోచలేదు. చివరికి అడవిని విడిచి వెడదా మనుకొన్నాయి కూడా.

ఆ దశలో ఒక కందిరీగ, ఏనుగు పనేదో తను చూస్తానన్నది. అని, మెల్లగా ఏనుగు దగ్గరకెళ్ళి చెవిలో దూరిపోయింది. ఈ కందిరీగను వదిలించుకోవడానికి ఏనుగు చాలా ప్రయత్నించింది. పెద్దగా ఘీంకరించింది. కోపంతో చెట్లను కొమ్మలను విరిచేసింది. చేతికందిన జంతువుల మీద విరుచుకు పడింది. కానీ కందిరీగ వదలలేదు.

ఆఖరుకు ఏనుగు విసుగెత్తిపోయి కందిరీగతో రాజీకి వచ్చింది. ఏనుగు ఈ అడవిని విడిచిపోతే, తను ఏనుగును విడిచిపోతానన్నది కందిరీగ. ఇక చేసేదేమీ లేక ఏనుగు ఆ అడవిని విడిచి వెళ్ళిపోయింది.

బలవంతుడ నాకేమని పలువురతో
నిగ్రహించి పలుకుట మేలు కాదు.